సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025

గరిష్టం / కనిష్టం
36° / 18°

వాతావరణం
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉదయం మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రెండో రోజూ గేట్ ప్రశాంతం


హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన గేట్–2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం మొదటి సెషన్‌లో 103 మందికి గాను 90 మంది, మధ్యాహ్నం రెండో సెషన్‌లో 130 మందికి గాను 117 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి 26 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ నెల 15,16 తేదీల్లో కూడా గేట్ పరీక్షలు ఉన్నట్లు తెలిపారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. 593 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.20,380 ఆదాయం లభించింది. 200 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,820 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు సరస్వతి పూజలు

పాల్వంచరూరల్: పంచమి సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం సరస్వతి దేవికి సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సీఐ ఎంపిక


సీఐ వజ్జ రవికుమార్

ఇల్లెందురూరల్: హైదరాబాద్‌లో ట్రాఫిక్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న, మండలంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన వజ్జ రవికుమార్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలీసుశాఖ రాష్ట్రస్థాయి క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అక్టోబర్‌లో హరియాణాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, వ్యాయామశాలల నిర్వాహకులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుచ్చిలో సింగరేణి స్కౌట్స్



డైమండ్ జూబ్లీ వేడుకల్లో సింగరేణీయులు

సింగరేణి(కొత్తగూడెం): తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చిలో ఆదివారం జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీకి సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ హాజరైన ఈ కార్యక్రమంలో సింగరేణి నుంచి 29 మంది పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో..


ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రభుత్వ కేంద్రాల్లో అధికంగా ధాన్యం కొనుగోళ్లు

- వానాకాలం సీజన్‌లో దాదాపు 94 శాతం సేకరణ
- రూ.262.07 కోట్ల విలువైన వడ్లు కొనుగోలు
- మద్దతు ధర, బోనస్ చెల్లింపుతో మొగ్గుచూపిన రైతులు
- రెండు రోజుల క్రితం ముగిసిన కొనుగోళ్ల ప్రక్రియ

వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యానికి చేరువలో నిలిచింది. ప్రభుత్వం గతేడాది కంటే రెట్టింపు సంఖ్యకు మించి రైతుల నుంచి కొనుగోలు చేసింది. అదేస్థాయిలో ధాన్యం సేకరించింది. కొనుగోళ్ల ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగియగా, దాదాపు 94 శాతం సేకరించగలిగింది. మద్దతు ధరతోపాటు సన్న రకం వడ్లకు బోనస్ చెల్లించడంతో అన్నదాతలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపే మొగ్గు చూపారు.

– పాల్వంచరూరల్

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1,61,550 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో లక్షా 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. కొనుగోళ్లకు పీఏసీఎస్, జీసీసీ, డీఆర్‌డీఏ, డీసీఎంఎస్ ద్వారా 160 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోపాటు బోనస్ కూడా చెల్లించింది. దీంతో ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారు. అయితే కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడం, అప్పటికే పెట్టుబడులకు తెచ్చిన అప్పులు చెల్లించాలని ఒత్తిడి రావడం, తర్వాత పంట సీజన్‌కు అవసరాలు ఉండటంతో కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. కేంద్రాల ప్రారంభంలో జాప్యం చేయకపోతే సేకరణ లక్ష్యం సాధించగలిగేవారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

6.31 వేల మెట్రిక్ టన్నులు కొన్న ప్రైవేటు వ్యాపారులు

ప్రైవేట్ వ్యాపారులు కల్లాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల కారణంగా కూడా కొందరు రైతులు ప్రైవేటు వైపు మొగ్గుచూపారు. తేమశాతం17 లోపు ఉంటేనే మద్దతు ధర, బోనస్ లభిస్తుందని, తాలు గింజలు, మట్టిపెళ్లలు, వ్యర్థాలు లేకుండా శుభ్రపరిచి పంట పొలాల వద్దనే గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలని నిబంధనలు విధించారు. తక్కువ రకాల మిశ్రమ ధాన్యం 6 శాతం లోపు ఉండాలని, పాస్ పుస్తకాలు లేని రైతులు వ్యవసాయ విస్తర్ణాధికారి ద్వారా ధ్రువీకరణ పత్రం తేవాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పట్టాలులేని, నిబంధనలు పాటించలేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవడమే మేలని కొందరు రైతులు భావించగా, ప్రైవేటు వ్యాపారులు 6.31 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు.

గతేడాది 46 వేల మెట్రిక్ టన్నులే

గతేడాది జిల్లాలో పౌరసరఫరాల శాఖ 157 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం నిర్దేశించగా 7,081 మంది రైతుల ద్వారా 46,826.480 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది. ఈ ఏడాది 160 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం నిర్దేశించగా 17,792 మంది రైతుల ద్వారా 1,13,169.800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. లక్ష్యం కంటే 6 వేల 31 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా సేకరించింది. గతేడాది కంటే అధికంగా ధాన్యం కొనుగోళ్లు చేసింది. మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించడంతో ధాన్యం సేకరణ పెరిగిందని చెప్పవచ్చు. జిల్లాలో సుమారు 6,750 మంది రైతులకు రూ. 19.50 కోట్ల బోనస్ చెల్లించారు. దాదాపు 80 శాతం మంది రైతుల ఖాతాల్లో బోనస్ నగదు జమ అయిందని, మిగిలినవారికి వివిధ కారణాలతో ఇంకా అందలేదని పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి తెలిపారు.

గత రెండు సీజన్లలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు(మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	లక్ష్యం	కొన్నది	విక్రయించిన రైతులు
ఈఏడాది వానాకాలం	1.20 లక్షలు	1.13 లక్షలు	17,792
గతేడాది వానాకాలం	లక్ష	0.46 లక్షలు	7,081

లక్ష్యానికి స్వల్ప తేడా..



ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రూ.262.07 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. నిర్దేశించిన లక్ష్యం కంటే కొంచెం తక్కువగా సేకరించాం. మార్కెట్‌లో ధాన్యానికి ధర అధికంగా ఉండటం, కొందరు రైతులు ప్రభుత్వం నిర్దేశించినట్లు గ్రేడింగ్ చేయలేకపోవడం ఇందుకు కారణంగా చెప్పవచ్చు. అధిక శాతం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు.

– త్రినాథ్‌బాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ డీఎం



సహచరులతో కప్ అందుకుంటున్న త్రిష

శతదిశలా భద్రగిరి త్రిషస్సు



- టీ–20 మహిళా ప్రపంచకప్‌లో రాణించిన జిల్లా బిడ్డ
- అండర్–19 విభాగంలో తొలి సెంచరీ సాధించిన రికార్డు
- గొంగడి త్రిషకు కలెక్టర్ సహా క్రీడాభిమానుల అభినందనలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: మహిళల టీ–20 ప్రపంచకప్‌లో జిల్లా వాసి గొంగడి త్రిష అద్భుతంగా రాణించింది. మహిళల అండర్ –19 విభాగంలో తొలి సెంచరీ సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. సిరీస్ ఆద్యంతం బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రతిభ చూపి కప్ గెలుచుకునేందుకు బాసటగా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచి జిల్లా కీర్తిని దశదిశలా వ్యాపింపజేసింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన ప్రపంచ్ కప్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ జట్టు విజయం సాధించింది. టోర్నీలో ఆడిన భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష ప్రతిభ చాటడంతో క్రీడాభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ప్రజల తరఫున కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి అభినందనలు తెలిపారు. జిల్లా పేరును ప్రపంచ వేదికపై నిలబెట్టిందని, ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిందని ప్రశంసించారు. త్వరలో ఆమెను ఘనంగా సత్కరిస్తామని పేర్కొన్నారు.

యువతకు ఆదర్శం

భద్రాచలంటౌన్: ప్రపంచకప్‌లో రాణించిన గొంగడి త్రిష ఏజెన్సీ యువతకు ఆదర్శంగా నిలిచిందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం భద్రాచలంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఇందిరా మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మాట్లాడారు. టోర్నీలో 300కు పైగా పరుగులు, 7 వికెట్లు తీయటం గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, ముర్ల రమేష్, కంభంపాటి సురేష్ కుమార్, చల్లగుల్ల నాగేశ్వరరావు, భూపతిరావు, మాధవరెడ్డి, శంకర్ రెడ్డి, సురేష్ బాబు, వెంకట్ రెడ్డి, రంగారెడ్డి, మారెడ్డి శివాజీ, సరిత, పద్మప్రియ, శ్రీనివాసరావు, నాగార్జున, ప్రదీప్ కుమార్, మురళి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

స్వరార్చనతో పులకించిన భద్రగిరి


భక్తి గీతాలను ఆలపిస్తున్న సంగీత కళాకారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తరామదాసు జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సంగీత కళాకారుల స్వరార్చనతో భద్రాద్రి పులకించిపోయింది. చింతలపాటి మంజుల, చివుకుల మాధవి, లాయక్ అహమ్మద్, శ్రీదుర్గా మైత్రేయి వీణావాద్య బృందం, వాసా పావని, అభిషేక్ సూత్రపు బృందం ఆలపించి గీతాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో చక్ర సిమెంట్స్ అధినేత నేంద్రగంటి కృష్ణమోహన్, ఆలయ ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ప్రధానార్చకులు పొడిచేటి విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. నిత్య కల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని విశాఖపట్నం జిల్లా చిట్టివలసకు చెందిన పోరం రామారావు పట్నాయక్–సరోజిని దంపతులు రూ. 2 లక్షల విరాళం అందించారు. ఆదివారం చెక్కును ఆలయ ఈఓ ఎల్.రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ పీఆర్వో సాయిబాబు, అధికారులు పాల్గొన్నారు.

నిధుల ఊసేది..?

- దళిత, గిరిజన వాడల్లో తీరని సమస్యలు
- మూడేళ్ల క్రితం సర్వే నిర్వహించిన సిబ్బంది
- జిల్లాలో 620 ప్రాంతాల్లో సమస్యల గుర్తింపు
- రూ.565 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు


అంతర్గత రోడ్లు లేని రామాంజనేయకాలనీ దళితవాడ

చుంచుపల్లి: దళిత, గిరిజనవాడల్లో కనీస వసతులు కరువయ్యాయి. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం 2021 ఆగస్టులో దళిత, గిరిజన వాడల్లో నెలకొన్న సమస్యలను గుర్తించేందుకు పంచాయతీ అధికారులతో సర్వే చేపట్టింది. అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించి కల్పించాల్సిన మౌలిక వసతులు, పరిష్కరించాల్సిన సమస్యలపై వ్యయ అంచనాలను రూపొందించి నివేదికలను ప్రభుత్వానికి పంపారు. మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు కేటాయించాలని దళిత గిరిజనులు కోరుతున్నారు.

620 ప్రాంతాల్లో సమస్యలు గుర్తింపు

జిల్లావ్యాప్తంగా 481 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 10,69,332 మంది జనాభా ఉండగా, ఇందులో ఎస్సీలు,1,59,831 మంది, ఎస్టీలు 4,06,584 మంది ఉన్నారు. ఇక మొత్తం జనాభాలో 8,53,157 మంది గ్రామీణులు ఉన్నారు. సర్వే ఆధారంగా 210 దళిత వాడలు, 410 గిరిజనుల గూడేలు .. మొత్తం 620 ఆవాసాల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉందని గుర్తించారు. ఇందుకోసం 11,521 పనులు చేపట్టాల్సి ఉండగా, 210 దళితవాడల్లో రూ.160 కోట్లు, 410 గిరిజన వాడల్లో రూ.407.90 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలతో పేర్కొన్నారు. ఈ పనులకు మొత్తం రూ.565 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పైసా కూడా విదల్చలేదు. కాగా ఎమ్మెల్యే కోటా కింద నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. ఆ నిధులతోనైనా ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో మౌలిక వసతులు కల్పించాలని దళితగిరిజనులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో ఆగమేఘాల మీద దళిత, గిరిజనవాడల్లో సర్వే చేపట్టి సమస్యల వివరాలను సేకరించింది. అప్పటి ప్రభుత్వ ఆలోచనలతో దళిత, గిరిజన వాడలకు మహర్దశ కలుగుందని భావించారు. ప్రభుత్వానికి సర్వే అంచనాలను పంపించి మూడేళ్లు దాటినా ఎక్కడా నిధుల ఊసే ఎత్తడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా దీనిపై ఆలోచన చేసి నిధులు మంజూరు చేయాలి.

– యెర్రా కామేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఎస్పీ

రేపు పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి మంగళవారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్‌ఎం డొబ్రియల్ రానున్నారు. వైల్డ్‌లైఫ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.49 లక్షల వ్యయంతో చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారని ఎఫ్‌డీఓ బాబు తెలిపారు. పీసీసీఎఫ్‌తోపాటు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ పారెస్ట్ భీమానాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. కాగా, పీసీసీఎఫ్ పర్యటన నేపథ్యంలో కిన్నెరసానిలోని పర్యావరణ కేంద్ర భవన వద్ద వృక్షాలకు రంగులు సుందరంగా తీర్చిదిద్దారు.

టమాట.. ఢమాల్



- పడిపోయిన ధర.. రూ.10కే కిలో
- రైతుకు దండగ.. వినియోగదారులకు పండగ
- స్థానికంగా పంట ఉత్పత్తి అధికం కావడంతో తగ్గిన రేటు

రూ.100 నుంచి రూ.10కి..

ఈ ఏడాది టమాట ధర ఒక దశలో కిలో రూ.100కు కూడా విక్రయించగా ప్రస్తుతం రూ.10కి పడిపోయింది. గత జూన్‌లో టమాట ధర బాగా పెరిగింది. హోల్‌సేల్ మార్కెట్లలో రూ.80, రిటైల్ మార్కెట్లలో రూ.100 నుంచి 120 వరకు కూడా విక్రయించారు. ఇక్కడ పంట ఉత్పత్తి ఆశించిన విధంగా లేకపోవడంతో మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఏపీలోని చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి దిగుమతి చేసుకుని విక్రయించారు. ఖమ్మం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో నిత్యం వ్యాపారులు 300 టన్నుల టమాటను దిగుమతి చేసుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, ఏపీలోని జగ్గయ్యపేట, నందిగామ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. రూ.100 ధర పలికిన కాలంలో దిగుమతి 100 టన్నులకు పడిపోయింది.

ఖమ్మంవ్యవసాయం: టమాట ధర బాగా తగ్గింది. ప్రభుత్వ మార్కెట్లు, రైతు బజార్లలో కిలో రూ.16గా బోర్డులపై రాసినా రైతులు రూ.10కే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం టమాట పంట సీజన్ కావడంతో ధరపై తీవ్ర ప్రభావం పడింది. స్థానికంగా డిమాండ్ కంటే ఉత్పత్తి అధికం కావడంతో ధర పడిపోయింది. ఇటీవలి కాలంలో టమాటకు ధర భారీగా ఉండడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పంట సాగుకు రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, రఘునాథపాలెం, కొణిజర్ల, చింతకాని, బోనకల్, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, ముదిగొండ, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, టేకులపల్లి, ఇల్లెందు, బూర్గంపాడు, చంద్రుగొండ, కామేపల్లి, కారేపల్లి మండలాల్లో కూరగాయల పంటల సాగులో భాగంగా రైతులు టమాటా సాగు చేస్తుంటారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడంతో టమాటకు అధిక ధర పలికింది. యాసంగి పంటగా నవంబర్, డిసెంబర్ నెలల్లో సాగు చేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో రైతులు ఎకరాల కొద్దీ టమాట పంట సాగు చేస్తుంటారు. ఇక్కడ సాగు చేసే టమాట రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ హోల్‌సేల్ మార్కెట్లలో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆయా రైతులతో పాటు కొద్ది విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు హోల్‌సేల్ మార్కెట్లలో, నేరుగా రిటైల్‌గా కూడా విక్రయిస్తున్నారు.

గతేడాది జనవరితో పోలిస్తే సగం ధరే..

గత ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో టమాట ధర రూ.20 పలికింది. ప్రస్తుతం రూ.10కే విక్రయిస్తున్నారు. అంటే గత జనవరి, ఫిబ్రవరి నెలలతో పోలిస్తే సగానికి సగం ధర పడిపోయింది. సాగు విస్తీర్ణం పెరగడం, పంట ఉత్పత్తి ఉండడంతో ధర బాగా తగ్గింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా టమాట సాగు చేసినట్లు ఉద్యాన అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు పొరుగు జిల్లాలు, ఏపీ నుంచి టమాట ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్‌కు దిగుమతి అవుతోంది. దీంతో ధర పడిపోయిందని ఉద్యాన అధికారులు విశ్లేషిస్తున్నారు.

వినియోగదారులకు ఊరట..

ప్రస్తుత సీజన్‌లో టమాట పంట రైతుకు దండగ కాగా, వినియోగదారులకు మాత్రం పండగ అని చెప్పవచ్చు. టమాట కిలో రూ.20 వరకు ధర పలికితే రైతులకు గిట్టుబాటవుతుంది. అయితే ప్రస్తుతం అందులో సగం ధర మాత్రమే ఉంది. దీంతో టమాట రైతుకు పంట సాగు దండగ కాగా, వినియోగదారులకు మాత్రం ఊరట లభిస్తోంది. ఒకప్పుడు అర కిలో కొనుగోలు చేసిన వినియోగదారులు.. ప్రస్తుతం 2 కిలోల వరకు కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ కూరలో టమాటా వినియోగించే అవకాశం ఉండడంతో వినియోగదారులు కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

600 మందికి పైగా హాజరు


పోటీలను ప్రారంభిస్తున్న సీఐలు

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయ స్థాయి కరాటే పోటీలు నగరంలోని వర్తక సంఘం భవన్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. త్రీటౌన్ సీఐ డి.రమేష్, ట్రాఫిక్ సీఐ కె.సాంబశివరావు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే దోహదపడుతుందని, ఈ క్రీడపై బాలబాలికలకు ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు సర్టిఫికెట్లు, పతకాలు లభిస్తాయని చెప్పారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 600 మందికి పైగా కరాటే విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పదమే లేదు

సింగరేణి(కొత్తగూడెం): ఎనిమిది మంది ఎంపీలను ఇస్తే, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అన్న ఊసే లేదని మినిమమ్ వేజెస్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ విభజన సమయంలో ఇచ్చిన హామీల ఊసేలేదని, పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేదని, ఐటీఐఆర్ మీద నోరుమెదపలేదని పేర్కొన్నారు.

ఇది మేడిపండు బడ్జెట్

మోదీ, నిర్మలమ్మల కేంద్ర బడ్జెట్ మేడి పండు బడ్జెట్‌లా ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ నాయకుడు పెద్దబోయిన సతీశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారులను మెప్పిస్తూ, మధ్య తరగతి వర్గాలను ఊరిస్తూ మసిబూసి మారేడు కాయ చేశారని, మౌలిక సమస్యలను వది లేసి, పేదలను, నిరుద్యోగులను, కార్మికులను వంచించే విధంగా ఉందని ఆరోపించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న 17 ఏళ్ల విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం కేజీబీవీలో చదువుతున్న ఓ విద్యార్థిని బయటకు వెళ్లేందుకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నుంచి రెండు గంటలు అనుమతి కోరింది. దీంతో కళాశాలకు వచ్చిన విద్యార్థిని వదిన ఫోన్ నంబర్ తీసుకుని, ఆమెతో బయటకు తీసుకెళ్తున్నట్లు లేఖ రాయించుకుని అనుమతినిచ్చారు. శనివారం రాత్రయినా ఆ విద్యార్థిని కళాశాలకు తిరిగి రాలేదు. దీంతో ప్రత్యేక అధికారి విద్యార్థిని వదిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. వారు ఇంటికి రాలేదని తెలిపారు. ఆదివారం ప్రిన్సిపాల్, విద్యార్థిని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చానెల్ రిపోర్టర్‌పై కేసు

రఘునాథపాలెం: ఓ టీవీ చానెల్ రిపోర్టర్‌పై రఘునాథపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. గత నెల 27న పువ్వాడనగర్ పరిధిలోని గుట్ట వద్ద నేషనల్ హైవే రోడ్డు కోసం ప్రభుత్వ అనుమతితో మట్టి తరలిస్తున్నారు. ఓ చానెల్ రిపోర్టర్ అక్కడికి వచ్చి, వారిని బెదిరించడంతో సైట్ ఇంజనీర్ దారగాని పాపారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చానెల్ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ద్విచక్రవాహనంలోని హారం చోరీ

పాల్వంచరూరల్: టీస్టాల్ వద్ద నిలిపి ఉన్న ద్విచక్రవాహనంలోని బంగారు ఆభరణాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన పాల్వంచ పట్టణంలో చోటుచేసుకుంది. బొల్లోరిగూడెంనకు చెందిన వడ్లమూడి పూర్ణచందర్‌రావు మూడు తులాల బంగారు చైన్‌ను తన స్కూటీలో పెట్టుకుని ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డులోని పూర్ణ టీస్టాల్ వద్దకు వచ్చి టీ తాగాడు. అనంతరం బంగారు చైన్ చూస్తే కన్పించలేదు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి చోరీ చేశారని ఆదివారం పూర్ణచందర్‌రావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

‘ఏం’పవర్‌మెంట్ సెంటర్లో..?

అందుబాటులోకి ఎప్పుడొస్తాయో..?

- ప్రారంభం అవుతున్న పెళ్లిళ్ల సీజన్
- వేలు, లక్షల్లో ఫంక్షన్ హాళ్ల రెంట్లు
- అవస్థలు పడుతున్న సామాన్య ప్రజలు



రాజీవ్‌పార్కు పక్కన ఉన్న ఎంపవర్‌మెంట్ సెంటర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో రెండేళ్ల కిందట నిర్మించిన ఎంపవర్‌మెంట్ సెంటర్లు ప్రజలకు ఇంకా అందుబాటులోకి రాలేదు. శుభ కార్యాలకు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు వేలు, లక్షల్లో రెంట్లు చెల్లించలేక సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. లక్షల రూపాయలను డీఎంఎఫ్ నిధుల నుంచి విడుదల చేసి నిర్మాణం చేపట్టి కూడా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌బస్తీ, రాజీవ్‌పార్కు పక్కన ఉన్న ఒక్కొక్కటి రూ.75 లక్షల వ్యయంతో నిర్మించారు. అయిన కూడా ఎంపవర్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించకుండా నిధులు సరిపడలేదని, మళ్లీ అదనంగా రూ.25 లక్షలను డీఎంఎఫ్ ఫండ్ నుంచి కేటాయింపులు చేయించుకొని పనులను నత్తనడకన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి నుంచి మొదలుకొని జూన్ వరకు కూడా పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యక్రమాలకు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ లోపు ఎంపవర్‌మెంట్ సెంటర్లు అందుబాటులోకి రాకుంటే పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ఎంపవర్‌మెంట్ సెంటర్లలో పనులు వేగంగా చేయించి ముహూర్తాల సమయం కల్లా అందుబాటులోకి తీసుకొస్తే అన్ని వర్గాల వారికి కొంత డబ్బు ఆదా అయినట్లు అవుతుంది.

ప్రైవేట్‌లో వేలు, లక్షలు

కొత్తగూడెంతో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు వేలు, లక్షల్లో కిరాయి వసూళ్లు చేస్తున్నారు. ముహూర్తాలు ఎక్కువగా ఉన్న రోజులు, పెళ్లిళ్ల సీజన్‌లో అసలు కొత్తగూడెంలో ఉన్న ఫంక్షన్ హాళ్లు సరిపోవడం లేదు. నెల, రెండు నెలల ముందుగానే అవసరమున్న వారు బుక్ చేసుకుంటున్నారు. అప్పుడు మిగిలి ఉన్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు లక్షల్లో కిరాయి చెబుతుండటంతో అవసరమున్న వారు అయోమయానికి గురి అవుతున్నారు. దీంతో చేసేదేమీ లేక కొందరు ఇళ్ల వద్దనే పెళ్లిళ్లు, ఇతర శుభకార్యక్రమాలు జరిపించుకుంటున్నారు. మరికొంత మంది పాల్వంచ, పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలోని ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలు చేసుకుంటున్నారు. దాదాపు కోటి వరకు ఖర్చు చేసిన ఎంపవర్‌మెంట్ సెంటర్లు అందుబాటులోకి వస్తే అందులో మున్సిపాలిటీకి నామినల్ రెంటును పేచేసి కార్యక్రమాలు, పెళ్లిళ్లు నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కొత్తగూడెం పట్టణంలో ఉర్దూ ఘర్ మాత్రమే నామినల్ రెంట్‌తో వివిధ రకాల ఫంక్షన్లు నిర్వహించేందుకు అందుబాటులో ఉంది. మిగతా వాటిల్లో అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. అయితే కొత్తగూడెం పట్టణ పరిధిలోని షాదీఖానా, టీటీడీ కళ్యాణ మండపానికి కూడా మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తే ఇకపై శుభకార్యక్రమాలు జరిపించేందుకు రెంట్ల కోసం ఆలోచించాల్సిన అవసరముండదు. టీటీడీ కళ్యాణ మండపం మరమ్మతులకు టీటీడీ దేవస్థానం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తున్నా కూడా టీటీడీ కళ్యాణ మండపం మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇదిలా ఉంటే షాదీఖానాకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకరావాలని ఉర్దూ ఘర్ అధ్యక్షులు ప్రయత్నాలు చేస్తున్నారు. షాదీఖానా మరమ్మతులు చేయించిన తరువాత సామాజిక కార్యక్రమాలకు, సమావేశాలకు ఉచితంగా ఇస్తామని అధ్యక్షులు ఇటీవల ప్రకటించారు. షాదీఖానాకు కూడా మైనార్టీ శాఖ నుంచి, మున్సిపాలిటీ నుంచి నిధులు విడుదల చేసి మరమ్మతు పనులు త్వరగా చేసి అందుబాటులోకి తీసుకొస్తే అన్ని వర్గాల వారికి కొంత ఊరట లభించే అవకాశం ఉంటుంది.

పనులు చివరి దశలో ఉన్నాయి..



కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఎంపవర్‌మెంట్ సెంటర్లలో చివరి దశ పనులు జరుగుతున్నాయి. ఆ పనులు అయిన తరువాత వినియోగంలోకి తీసుకొస్తాం. అన్ని వర్గాల వారికి ఉపయోగపడే విధంగా నిర్మాణం చేపట్టాం. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

మాకు న్యాయం చేయండి..

మొక్కజొన్న మొలకెత్తకపోవడంతో రైతుల ఆవేదన



కంపెనీ ఆర్గనైజర్‌తో మాట్లాడుతున్న రైతులు

టేకులపల్లి: కంపెనీ ప్రతినిధి మాటలు నమ్మి మొక్కజొన్న పంట వేస్తే మొలకెత్తలేదని, తమకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని చంద్రుతండా, సూర్యతండా, గోప్యాతండా గ్రామాల రైతులు కోరారు. రైతుల ఫిర్యాదు మేరకు శనివారం సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆదివారం బాధిత రైతులు టేకులపల్లి సీఐని కలిసి గోడు వెల్లబోసుకున్నారు. దీంతో సీఐ విత్తన కంపెనీ ఆర్గనేజర్‌ని పిలిపించి విచారణ చేపట్టారు. రైతులు, విత్తన కంపెనీ ప్రతినిధితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. వసుధ కంపెనీ ఆర్గనైజర్ రాజేందర్‌రెడ్డి లక్కినేని సురేందర్‌రావు ద్వారా 258 ఎకరాల్లో రైతులకు మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేసేందుకు పరస్పరం మాట్లాడుకున్నారు. వరి చేనుల్లో మొక్కజొన్న వేయొద్దని, మెట్ట భూముల్లో వేయాలని, ఎకరానికి రూ.10 వేలు చొప్పున నగదు, పురుగులమందులు ఇస్తామని, పంట చేతికొచ్చాక క్వింటాకు రూ.3 వేలు ఇచ్చి పంటను తీసుకుంటామని, అన్ని జాగ్రత్తలు తీసుకున్నా పంట పాడైతే ఎకరానికి రూ.50 వేలు ఇస్తామని రైతులతో మాట్లాడుకున్నారు. సుమారు 40 ఎకరాల్లో వరి చేన్లలో మొక్కజొన్న వేయడం వల్ల పంట పాడైంది. దీంతో ఆ క్షేత్రాలను దున్నించారు. నష్టపరిహారం కోసం రైతులు అడిగితే సూర్యాతండా గ్రామంలో కంపెనీ ఆర్గనైజర్‌తో పాటు లక్కినేని సమక్షంలో రైతుల సమావేశం నిర్వహించి రూ.20 వేలు వారం రోజుల్లో ఇచ్చే విధంగా అంగీకారానికి వచ్చారు. వారం రోజులైనా డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటకు పొక్కింది. అయితే రెండో పంట వేయలేని విధంగా నష్టపోయామని తమకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు చెల్లించాలని లక్కినేని ఖాతాలో రూ.17 లక్షలు జమ చేశామని, కంపెనీ ఆర్గనైజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. 258 ఎకరాలకు విత్తనాలు ఇస్తే 110 ఎకరాలకే పంపిణీ జరిగినట్లు తేలిందని పేర్కొన్నారు. వరి చేన్లలో మొక్కజొన్న వేయొద్దని చెప్పినా రైతులు వేశారన్నారు. ఇదిలా ఉండగా నష్టపరిహారం విషయంలో రైతులకు, విత్తన కంపెనీ ప్రతినిధుల మధ్య మంతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా, మరో రెండు కంపెనీలకు సంబంధించిన విత్తనాలను సైతం రైతులకు పంపిణీ చేసినట్లు సమాచారం.

స్పెషల్ పార్టీ సిబ్బంది ట్రాఫిక్‌కు అటాచ్‌మెంట్

ఖమ్మంక్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పెషల్ పార్టీలో విధులు నిర్వర్తిస్తున్న 16 మంది సిబ్బందిని ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తూ సీపీ సునీల్‌దత్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ పార్టీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సివిల్ హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఆర్ విభాగం హెడ్‌కానిస్టేబుళ్లు నలుగురు, పది మంది కానిస్టేబుళ్లను ట్రాఫిక్ విభాగానికి అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఇసుక లారీ పట్టివేత

పాల్వంచరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగారంవైపు వెళ్లే రహదారిలో శనివారం రాత్రి ఇసుకను తరలిస్తున్న లారీని ఆర్‌ఐలు హచ్యా, రవికుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నట్లు తేలడంతో ఇసుక లారీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

సైబర్.. టెర్రర్

☛ ఖమ్మం జిల్లాలో ఉన్న ఓ వైద్యుడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ‘మేం ఢిల్లీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఫోన్ ద్వారా ఉగ్రవాదులకు కాల్స్ వెళ్తున్నాయని, మిమ్మల్ని అరెస్ట్ చేయడానికి వస్తున్నా’మని చెప్పాడు. వెంటనే వీడియో కాల్ ద్వారా మరో ఇద్దరు మాట్లాడుతూ.. తాము సెంట్రల్ ఇంటెలిజెన్స్ విభాగమని, మీరు ఉగ్రవాదులకు ఫోన్‌లో సంప్రదింపులు జరుపుతున్నట్లు తేలిందని, వెంటనే అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపుతామని చెప్పారు. తమకు డబ్బు కావాలని అడగ్గా.. వారితో మాట్లాడుతూనే వైద్యుడు మరో ఫోన్‌లో తమకు తెలిసిన సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాడు. వారు ఆ నంబర్‌ను పరిశీలించి.. సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చినట్లు నిర్ధారించారు. వెంటనే ఆ వైద్యుడు ఫోన్ కట్ చేసి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు.

☛ సత్తుపల్లి ప్రాంతంలో డబ్బా కొట్టు నిర్వహిస్తున్న ఓ కిరాణా వ్యాపారికి ఫోన్ వచ్చింది. తాము తెలంగాణ ప్రభుత్వ శాఖ నుంచి మాట్లాడుతున్నామని, మీకు ఆరోగ్య భద్రత కింద రూ.15 వేలు మంజూరయ్యాయని, వాటిని అకౌంట్‌కు పంపుతామని, ఫోన్‌పే నెంబర్ చెప్పమని అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. సదరు డబ్బా కొట్టు వ్యాపారి తనకు ఫోన్‌పే, గూగుల్‌పే లేవని తెలిపారు. అయితే మీకు సంబంధించిన వారికైనా పంపుతామని చెప్పడంతో తన సోదరుడు ఫోన్‌పే, గూగుల్‌పే వాడతాడని, ఆయనతో మాట్లాడమని సెల్ కాన్ఫరెన్స్ కలిపారు. దీంతో అవతలి వ్యక్తి ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లతో పాటు యూపీఐ నబర్, అన్ని వివరాలు అడిగాడు. ఐదు నిమిషాల్లో డబ్బులు పడిపోతాయంటూ ఫోన్ కట్ చేశాడు. కాసేపట్లో కొట్టు యజమాని సోదరుడి అకౌంట్‌లో ఉన్న రూ.35 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లగా అకౌంట్‌లో ఉన్న డబ్బు డెబిట్ అయిందని చెప్పారు. దీంతో అవాక్కయిన వ్యక్తి వెంటనే తమకు ఫోన్ చేసిన నంబర్‌కు కాల్ చేయగా స్విచాఫ్ అయింది. జరిగిన మోసం అర్థమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేరాల్లో నిందితుల కొత్తకోణం

- అమాయకులే లక్ష్యంగా ఎత్తుగడలు
- నమ్మకంగా చెప్పే మాటలు, బెదిరింపులతో మోసపోతున్న జనం
- అధికారులు అవగాహన కల్పిస్తున్నా అదే పరిస్థితి



ఖమ్మంక్రైం: సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లకు అవకాశాలు పెరుగుతున్నాయి. మరోవైపు ఇన్ని మోసాలు జరుగుతున్నా.. ప్రజల్లో మాత్రం ఇంకా మార్పు రావడం లేదు. రుణం వస్తుంది, లాటరీ వచ్చింది అంటే అమాయకంగా సైబర్ నేరగాళ్ల మాయలో పడుతున్నారు. ప్రస్తుతం వీరు సరికొత్త దారులను ఎంచుకుని మోసాలకు పాల్పడుతున్నారు. లాటరీలో డబ్బులు వచ్చాయని, సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెబుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఉగ్రవాదులకు సాయం చేస్తున్నారని, ఎయిర్‌పోర్ట్‌లో మీ పేరుతో ఉన్న పార్శిల్‌లో డ్రగ్స్ దొరికాయని ఇలా చెబుతూ దందాకు పాల్పడుతున్నారు. కొందరు తెలివిగా ఇది సైబర్ నేరగాళ్ల పని అని తెలుసుకుంటుండగా.. మరికొందరు మాత్రం వారి మాయ మాటలకు బలైపోతున్నారు.

కొత్త దారులు వెదుక్కుంటూ..

ప్రస్తుతం ప్రతిఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. చాలామందికి సైబర్‌నేరాల పట్ల అవగాహన కలుగుతోంది. ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త దారులను ఎంచుకుంటున్నారు. ఇందుకు లాటరీలు, రుణాలను ఆయుధాలుగా చేసుకుంటున్నారు. డబ్బు అవసరం ఉన్నవారు, సైబర్ నేరాల గురించి అవగాహన లేనివారు వీరిబారిన పడుతున్నారు. మరోవైపు నేరాలకు పాల్పడ్డారని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ నేరం తాము చేయలేదని తెలిసినా సైబర్ నేరగాళ్ల మాటలకు అమాయకులు హడలిపోతున్నారు. తమ వద్ద ఉన్న డబ్బు పోగొట్టుకుంటున్నారు.

గత నెలలోనే 10 కేసులు..

గత నెలలో జిల్లావ్యాప్తంగా 10 సైబర్ క్రైమ్‌లు నమోదయ్యాయి. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఇక సైబర్ నేరగాళ్ల బారిన పడి ఫిర్యాదులు చేయకుండా ఉన్నవారు కూడా ఉన్నారు. గత ఏడాది రూ.34 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్ల ద్వారా ప్రజలు డబ్బులు పోగొట్టుకున్నారు. 2,148 కేసులు అయిన విషయం విదితమే.

ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు..



మన ఆశ, అత్యాశలను సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకుంటున్నారు. నిత్యం వాడే సోషల్ మీడియాకు సంబంధించి ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఈమెయిల్ ద్వారా దృష్టిని ఆకర్షించి వాటి ద్వారా సైబర్ నేరగాళ్లు గాలం వేస్తుంటారు. ఎట్టి పరిస్థితుల్లో వారి మాయలకు ఆకర్షితులు కావద్దు. ఒకవేళ మోసపోతే వెంటనే సైబర్ క్రైమ్‌కు సంబంధించి 1930 నంబర్‌కు కాని, www.cybercrime.gov.in లో కాని సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలన్నారు.

– ఫణీందర్, డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ

వైరస్‌తో కోళ్లు మృత్యువాత



వైరస్ సోకిన కోళ్లు

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్లకు వైరస్ సోకి సుమారు 50 వేల కోళ్లు మృతిచెందాయి. సుమారు రూ.35 లక్షల వరకు నష్టం జరిగిందని భావిస్తున్నారు. మండలంలోని పాయపూరు, యజ్ఞనారాయణపురం, పెద్దకోరుకొండి, వెన్నవెల్లి, పేరువంచ, నారాయణపురం, కొర్లగూడెం, కల్లూరులలోని కోళ్ల ఫారాల్లో కోళ్లు పెంచుతున్నారు. గాలి నుంచి సోకిన వైరస్ వల్ల బ్రాయిలర్‌తోపాటు నాటు కోళ్లు కూడా మృత్యువాత పడుతున్నట్లు చెబుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెడితే అపార నష్టం సంభవించిందని కోళ్ల ఫారం యజమానులు లక్ష్మీనరసింహారావు, భూక్యా శివ, కృష్ణ వాపోయారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి 10వ తేదీ వరకు వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండలోని కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో స్వీకరించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్ వద్ద బారికేడ్లు

ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉంటుంది. 11న నామినేషన్లు పరిశీలిస్తారు. 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, మార్చి 3వ తేదీన ఓట్లు లెక్కిస్తారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నల్లగొండ కలెక్టరేట్ బయట 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. 100 మీటర్లలోపు మూడు వాహనాలు, నామినేషన్ వేసే అభ్యర్థితో కలిపి ఐదుగురిని మాత్రమే అనుమతించనున్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..

నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకుగాను నామినేషన్ల స్వీకరణ హాల్ ముందు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్లు నింపడంలో ఎలాంటి సందేహాలున్నా అక్కడి సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. నామినేషన్లు నింపుకుని వచ్చిన అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా అన్నీ ఉన్నాయా.. ఇంకా ఏవైనా పూర్తి చేయాలా.. ఏవైనా సర్టిఫికెట్లు జత చేయాలా తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ సమర్పించేందుకు ఎక్కువ మంది ఒకేసారి వస్తే ఇబ్బంది కలుగకుండా వెయిటింగ్ హాల్ కూడా ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఇలా..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు సమర్పించే వారు జనరల్ అభ్యర్థి అయితే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎమ్మెల్సీకి పోటీ చేసే వ్యక్తి తెలంగాణలో జనరల్ ఓటరై ఉండాలి. రాష్ట్రంలోని ఏ జిల్లాల్లో కూడా ఓటు హక్కు లేకపోతే పోటీకి అనర్హుడు.
- నామినేషన్ సమర్పించే అభ్యర్థికి పది మంది ప్రపోజల్స్ సంతకాలు చేయాల్సి ఉంటుంది. వారంతా వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఈ మూడు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరై ఉండాలి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రదీప్ (ఫైల్)

మణుగూరుటౌన్: లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో లారీ కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని కాళీమాత ఏరియాకు చెందిన రావుల ప్రదీప్ (29) మణుగూరులోని కారు షోరూంలో పనిచేస్తున్నాడు. రాత్రి బంధువుతో పట్టణంలో పని నిమిత్తం వచ్చి మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చుని ఇద్దరూ గుట్టమల్లారం మీదుగా కమలాపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో మణుగూరు నుంచి హుజూర్‌నగర్ వైపున్న సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్న బొగ్గు లారీని ఓవర్‌టేక్ చేయబోయి 100 పడకల ఆస్పత్రి సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న లారీ టైర్ల కింద పడ్డాడు. బైక్ వెనుక కూర్చున్న ప్రదీప్ తల పూర్తిగా ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. మృతుడి తండ్రి రావుల వెంకటేశ్వర్లు మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

మరో ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకన్న (ఫైల్)

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన చాతర్ల వెంకన్న (58) ఆంధ్రాబ్యాంక్ ఎదుట సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న మణుగూరుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కారు సైకిల్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకన్నను 108లో ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

బూర్గంపాడు: మండలంలోని నకిరిపేట గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. టేకులచెరువు గ్రామానికి చెందిన చింతనిప్పు మురళి(40) బైక్‌పై వెళ్తుండగా నకిరిపేట గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.